సాక్షి విశాఖపట్నం

సోమవారం। 13। మే। 2024

ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున



ఈవీఎంలను బయటకు తీసుకొస్తున్న సిబ్బంది





నేడే ఓట్ల పండగ

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఉదయం నుంచి 7 నుంచి సాయంత్రం 6 వరకు..
- అన్ని కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఒక లోక్‌సభతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీపడుతున్న అభ్యర్థుల తలరాతలు రాసేందుకు ఓటర్లు రెడీ అయ్యారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటరు ఇబ్బంది పడకుండా 11 రకాల కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒకవేళ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా కంట్రోల్ రూమ్ లేదా, టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.



ఏయూలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు, కిటకిటలాడుతున్న పంపిణీ కేంద్రాలు





ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బయటకు తీసుకొని వస్తున్న సిబ్బంది



పెదజాలరిపేటలో ఏర్పాటు చేసిన పింక్ పోలింగ్ బూత్



ఊళ్లకు పోటెత్తిన ఓటర్లు!

- ఓటేసేందుకు స్వగ్రామాలకు..
- బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం
- రైళ్లన్నీ కిటకిట

8లో





బస్సుల్లో వేలాడుతూ..ద్వారకాబస్‌స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

బరిలో ఉన్న అభ్యర్థులు
విశాఖ పార్లమెంట్ -33
భీమిలి-15
విశాఖ తూర్పు-14
విశాఖ దక్షిణ-16
విశాఖ ఉత్తర-13
విశాఖ పశ్చిమ-13
గాజువాక-14
ఎస్.కోట-12
పెందుర్తి-14

5 వేల మందితో బందోబస్తు 8లో / ఎన్నికల సామగ్రి తరలింపు 8లో / శ్రద్ధతో.. అంతఃకరణ శుద్ధితో.. 10లో

జిల్లాలో మొత్తం ఓటర్లు	20,12,373
విశాఖ పార్లమెంట్ పరిధిలో ఓటర్లు :	19,27,303
మొత్తం ఎన్నికల కేంద్రాలు	847
జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు	1991
విశాఖ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాలు :	1962
జిల్లాలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు :	502
విశాఖ పార్లమెంట్ పరిధిలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు :	497
ఎన్నికల నిర్వహణకు మొత్తం అధికారులు :	13,069
ప్రిసైడింగ్ అధికారులు	2183
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు	2,192
ఇతర ప్రిసైడింగ్ అధికారులు	8,649
విశాఖ ఎంపీ పరిధిలో ఏఆర్‌వోలు	22
నోడల్ అధికారులు	21
జిల్లాలో మొత్తం సెక్టార్లు	152
ఎలక్షన్ రూట్స్	207
పోలింగ్‌కు వినియోగిస్తున్న బ్యాలెట్ యూనిట్లు	9627
కంట్రోల్ యూనిట్లు	4,681
వీవీప్యాట్స్	5,040
వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు	1,457
మోడల్ పోలింగ్ కేంద్రాలు	11
మహిళలతో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలు	07
వికలాంగుల ఆధ్వర్యంలో నడిచే పోలింగ్ కేంద్రాలు	02
వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చెయిర్లు	1000
ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, విశ్రాంతాధికారులు (సహాయకులు)	600
కంట్రోల్ రూమ్ నంబర్ :	0891-2590100
టోల్ ఫ్రీ నంబర్	1950
ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్న భద్రతా సిబ్బంది	3000
సీఆర్‌పీఎఫ్ క్యాంపులు	10
ఏపీఎస్‌పీ క్యాంపులు	1
ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్,రిటైర్డ్ పోలీస్, ఆర్మీ అధికారులు	962
స్ట్రైకింగ్ ఫోర్స్ మొబైల్ రూట్స్	194
నమోదు చేసిన బైండోవర్ కేసులు	5290

ఆ రూ.కోట్లు ఏం చేశారు?

- ఉత్తర బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళా ఓటర్లు
- తమకు డబ్బు ఎందుకు పంచలేదని వాగ్వాదం



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన ఓటర్లు

సీతమ్మధార : విశాఖ ఉత్తర బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజుకు చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఆయన ఓటర్లకు డబ్బులు పంచుతున్నారు.. అయితే కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు పంపిణీ జరగలేదు. దీంతో సీతంపేట ప్రాంతానికి చెందిన కొంత మంది మహిళా ఓటర్లు ఆదివారం రాత్రి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఉన్న బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ముట్టడించారు. కొంతమందికే ఎలా ఇస్తారు.. తామూ ఓటర్లమేనని, తమకు డబ్బులు ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. పార్టీ నుంచి వచ్చిన కోట్లాది రూపాయలు ఏం చేశారని నిలదీశారు. ఎట్టకేలకు పార్టీ నాయకులు వచ్చి ఆందోళన చేయవద్దని, మీకూ డబ్బు ఇస్తామని చెప్పడంతో వారంతా శాంతించారు. వీరు ఆందోళన చేస్తున్నప్పటికీ అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకోలేదు. బీజేపీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన సమయంలో అభ్యర్థి విష్ణు కుమార్‌రాజు అక్కడ లేరు. డబ్బుల కోసం మహిళా ఓటర్లు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించడం సంచలనంగా మారింది.

పశ్చిమలో 'గణ'ంగా ప్రలోభాలు

- పురుషులకు మద్యం బాటిళ్లు, మహిళలకు తాయిలాలు
- ఆర్పీలకు బంగారు నల్లపూసలు, అంగన్‌వాడీలకు వెండి భరిణిలు
- ఒక్కో డ్వాక్రా సంఘానికి రూ.5 వేలు అందజేత
- ఓటరుకు రూ.2 వేలు పంపిణీ
- ఓటింగ్ రోజు పోలింగ్ కేంద్రం వద్ద కూడా పంపిణీకి ఏర్పాట్లు?
- పంపకాల్లో గిల్ట్ నగలతో మోసం చేశారని ఆరోపణ



నల్లపూసలు, వెండి భరిణి

విశాఖ సిటీ: పశ్చిమలో పచ్చ పార్టీ నేతలు బరితెగించారు. ఎన్నికల వేళ ప్రలోభాలకు తెర లేపారు. డ్వాక్రా, అంగన్‌వాడీలకు తాయిలాల ఎర వేస్తున్నారు. ఓటర్లకు ఇష్టానుసారంగా డబ్బు వెదజల్లుతున్నారు. మద్యం ఏరులై పారిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి ఏకంగా బంగారాన్ని కూడా పంపిణీ చేశారు. ఈసారి సుమారు రూ.50 కోట్లు వరకు ఖర్చు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆర్పీలకు బంగారు నల్లపూసలు

నియోజకవర్గంలో మహిళలను ప్రలోభ పెట్టేందుకు గణబాబు కొత్త ఎత్తుగడ వేశారు. డ్వాక్రా గ్రూప్ లీడర్లు ఆర్పీల ద్వారా – మిగతా 8లో

5 వేల మందితో బందోబస్తు


సీసీ కెమెరాల ద్వారా మానటరింగ్‌ను వివరిస్తున్న సీపీ రవిశంకర్

- కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ
- బాడీ వార్నింగ్ కెమెరాలతో నిఘా
- ప్రత్యేక తరగతి ఓటర్ల ఫిర్యాదుల కోసం ఏర్పాట్లు
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్


ఎగైల్ యాప్ పని చేసే విధానం గురించి వివరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: ఎన్నికల నిర్వహణకు ఐదు వేలకుపైగా సిబ్బందితో నగర వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లతో నగర పోలీస్ శాఖ ఎన్నికలకు పూర్తిగా సమాయత్తమైందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మూడు వేల మంది సెమీ ఫోర్స్, వెయ్యి మంది ఏఆర్ సిబ్బంది, 10 కంపెనీల సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ టీమ్, స్పెషల్ పోలీస్ ఆఫీసర్, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్, ఆర్మీ, నేవీ, ఎన్‌సీసీ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలను నిరంతరం మానిటరింగ్ చేసేలా అత్యాధునిక సాంకేతికతను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వినియోగించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎగైల్ యాప్‌తో నిఘా..

ఎలక్షన్ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది కోసం నూతన సాంకేతికతతో ఎగైల్ యాప్ రూపొందించారని తెలిపారు. ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాక్టివ్‌గా ఉంటుందన్నారు. నగర పరిధిలో ఏ ప్రాంతంలోనైనా అనుకోని సంఘటన జరిగిన ప్రాంతానికి 3 కిలోమీటర్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అలర్ట్ చేస్తుందన్నారు. దీంతో సిబ్బంది సత్వరం అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తారన్నారు.

బాడీ వార్న్ కెమెరాల ద్వారా..

ఎన్నికల్లో బాడీ వార్న్ కెమెరాలు వినియోగిస్తూ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు తెలిపారు. వీడియో, ఆడియోల రూపంలో ఆధారాలు సేకరిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద, ఇతర ప్రాంతాల వద్ద రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తూ ఎవరైనా అల్లర్లు, సమస్యలు సృష్టిస్తే రియల్ టైమ్‌లో సమాచారం అందడంతో పాటుగా తదుపరి విచారణకు కావాల్సిన ఆధారాలను సైతం సేకరించే అవకాశం ఉంటుందన్నారు. అల్లర్ల సృష్టించిన వ్యక్తులను సులభంగా గుర్తించడానికి ఇవి సహాయపడతాయన్నారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాటు

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డీడీఎస్ (దిశ దివ్యాంగ్ సురక్ష) హెల్ప్ లైన్ ద్వారా దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడంలో ఎటువంటి సమస్యలు ఏర్పడినా హెల్ప్ లైన్‌కు తెలియజేయవచ్చన్నారు.

155 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

నగరంలో 155 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు సీపీ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంతోపాటు, ఆయా పోలింగ్ బూత్‌లకు వెళ్లే రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల వరకు సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లు, యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌పై షాడో టీమ్స్ మఫ్టీలో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగినా డయల్ 112 నంబర్‌కు గానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీపీ వాట్సాప్ ద్వారా ఫొటోలు, వీడియోలతో కూడిన ఫిర్యాదులు 9493336633 నంబర్‌కు పంపవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎన్నికల సామగ్రి తరలింపు


ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు తీసుకొస్తున్న సిబ్బంది


ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది


సిబ్బందితో కిటకిటలాడిన ఏయూలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం


సిబ్బందిని తరలించడానికి ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో సిద్ధంగా ఉన్న వాహనాలు


భోజనాలు సిద్ధం చేస్తున్న కేటరింగ్ సిబ్బంది


ఎన్నికల సామగ్రితో పోలింగ్ బూత్‌లకు ప్రయాణమవుతున్న సిబ్బంది

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వినియోగించనున్న పోలింగ్ మెటీరియల్ ఆదివారం పంపిణీ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 9,627 బ్యాలెట్ యూనిట్లను, 4,681 కంట్రోల్ యూనిట్లను, 5,040 వీవీప్యాట్లను అధికారులకు ఏయూలో ఏర్పాటు చేసిన ఏడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా అందజేశారు. 207 రూట్లకు గాను సుమారు 707 వాహనాలను కేటాయించి వాటి ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని గట్టి బందోబస్తు మధ్య తరలించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున దగ్గరుండి పర్యవేక్షించారు. జేసీ మయూర్ అశోక్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్వోలు, సెక్టోరల్ అధికారులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యారు.

ఊళ్లకు పోటెత్తిన ఓటర్లు!


ప్రయాణికులతో రద్దీగా మారిన ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్


బస్సులో ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

సాక్షి, విశాఖపట్నం : సొంతూరిలో ఓట్ల పండక్కి నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు పెద్ద ఎత్తున పయనమయ్యారు. దీంతో బస్టాండ్లు రద్దీగా మారాయి. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. రైళ్లన్నీ కిటకిటలాడుతూ ప్రయాణించాయి. ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలింపు కోసం పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను తరలించారు. దీంతో బస్సులకు కొరత ఏర్పడింది. దీంతో బస్సుల కోసం జనం పడిగాపులు కాయాల్సి వచ్చింది. శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు ప్రైవేటు వాహనాల్లో పయనమయ్యారు. గత ఎన్నికలకంటే ఈసారి ఇతర ప్రాంతాల నుంచి ఓటేయడానికి ఎక్కువగా వచ్చారు. వీరి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఆర్టీసీ దూరప్రాంతాల నుంచి అదనపు బస్సులను నడుపుతోంది. అయినప్పటికీ ఈ బస్సులు వీరి అవసరాలను తీర్చలేకపోయాయి. తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

మీరు ఓటు వేయకపోతే..



ఓటర్లలో చైతన్యవంతం తేవడానికి ఓ విద్యార్థిని వేసిన రంగవల్లిక పలువురిని ఆలోచింపజేస్తోంది. ఇఫ్ యూ డోన్ట్ ఓట్ యూ లాస్ ద రైట్ టూ కంప్లైయిన్ అంటూ అక్షరాలలో రాసి, నమూనా బ్యాలెట్ బాక్సులో ఓటు వేస్తున్నట్టుగా ముగ్గు అకట్టుకుంది. సోమవారం ఎన్నికల సందర్భంగా కస్పావీధి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ ముగ్గు వేసిన విద్యార్థిని స్థానికులు అభినందించారు. – అనకాపల్లి

పశ్చిమలో 'గణ'ంగా ప్రలోభాలు

7వ పేజీ తరువాయి

సంఘాల సభ్యులను తన వైపునకు తిప్పుకోవాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా ఆర్పీలకు బంగారం కాసుల నల్లపూసలు పంపిణీ చేశారు. సాధారణ సమయంలో పైసా కూడా తియ్యని గణబాబు.. ఈ ఎన్నికల సమయంలో మాత్రం రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లందరికీ వెండి భరిణలు పంచిపెట్టారు. రెండు రోజుల క్రితమే డ్వాక్రా సంఘాలకు కూడా నగదు పంపిణీ చేశారు. 10 మంది సభ్యులు ఉండే ఒక్కో సంఘానికి రూ.5 వేలు చొప్పున అందజేశారు.

ఓటర్లకు రూ.2 వేలు

ఓటర్లకు సైతం డబ్బు ఎరవేశారు. నియోజకవర్గంలో ఒక్కో ఓటర్‌కు రూ.2 వేలు చొప్పున పంపిణీ చేశారు. ముందు రోజు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసి అందులో ఉన్న సభ్యుల ఆధారంగా ద్వితీయ శ్రేణి నాయకుల ద్వారా మరుసటి రోజు ఇంటింటికి వెళ్లి రూ.2 వేలు అందజేశారు. అయితే కొంత మందికి రూ.1000 ఇవ్వడం.. మరికొంత మందికి అందకపోవడంతో వారు నాయకులను నడిరోడ్డు మీదే నిలదీశారు. ప్రతి ఒక్కరికీ ఓటింగ్ రోజున పోలింగ్ స్టేషన్ వద్ద పంపిణీ చేస్తామని చెప్పి నాయకులు వెళ్లిపోతున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద కూడా పెద్ద ఎత్తున డబ్బు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

గిల్టు నగలతో మోసం

పశ్చిమ టీడీపీ అభ్యర్థి గణబాబు బంగారం పూసలు, వెండి ఆభరణాలంటూ గిల్టు నగలు ఇస్తూ మహిళా సంఘాల్ని మభ్య పెట్టారని ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. మొదటి నుంచి మహిళల తాయిలాలు ఇస్తూ ఓట్లు పొందే గణబాబు నిజస్వరూపం మహిళలకు తెలియడంతో అవాక్కవుతున్నారు. ఆర్పీలకు నల్లపూసలు ఇచ్చిన గణబాబు, పలు మహిళా సంఘాలకు ఇదేవిధంగా బంగారు, వెండి ఆభరణాలు ఇస్తామంటూ గిల్ట్ నగలను, ఇవ్వడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోసంతో గెలవాలని అనుకుంటున్న గణబాబుకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని మహిళలు హెచ్చరిస్తున్నారు.

చెరగని సిరా వినియోగంపై
వదంతులు నమ్మొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట: చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై వారి ఇంటి వద్దే మార్క్ చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రైవేటు వ్యక్తులు సేకరించడానికి గానీ, వినియోగించడానికి గానీ వీలులేదన్నారు. కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది వద్ద పోలింగ్ సమయంలో మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లకు గుర్తు పెట్టడానికి మాత్రమే ఉపయోగిస్తారని వివరించారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు అపోహలకు గురికాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

'వుయ్' యాప్‌తో ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు


భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి చంద్రమౌళి

తగరపువలస : 'వుయ్' యాప్ ద్వారా ఓటర్లను టీడీపీ ప్రలోభాలకు గురి చేస్తోందని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి కె.చంద్రమౌళి భీమిలి ఆర్డీవో కార్యాలయంతోపాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రూపొందించిన ఈ యాప్‌తో ఓటర్ల డేటా చౌర్యం చేయడంతోపాటు ఓట్లు కొనుగోలుకు తెర తీసిందన్నారు. చట్టవిరుద్ధంగా ఇతర పార్టీలు, తటస్థులుగా ఉన్న ఓటర్ల వివరాలు ఈ యాప్ ద్వారా సేకరించి యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఎన్నికలు సజావుగా సాగాలంటే ఇలాంటి అడ్డదార్లను అడ్డుకోవాలని చంద్రమౌళి కోరారు.

'వుయ్' యాప్‌ను తక్షణమే నిలిపివేయాలి

గాజువాక : ఎన్నికల నేపథ్యంలో టీడీపీ రూపొందించి అమల్లోకి తీసుకొచ్చిన 'వుయ్' యాప్‌ను తక్షణమే నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తరఫున ప్రతినిధి చింతపల్లి ఈశ్వరరావు గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డితోపాటు గాజువాక శాంతి భద్రతల విభాగం సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల డేటాను అక్రమంగా సేకరించడంతోపాటు వారిని ప్రలోభ పెట్టడానికి, బెదిరించడానికి ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. యాప్ ద్వారా ఓటర్ల డేటాను సేకరించి వారిని ప్రలోభపెట్టడానికి ట్రాకింగ్ బార్ కోడ్ కలిగిన ఓటరు స్లిప్పులను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ యాప్ వల్ల ఓటర్ల యూపీఐ ఖాతాలకు ప్రత్యక్ష ఆర్థిక లావాదేవీలు నడుస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్య ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడమేకాక ఓటర్ల గోప్యత, చిత్తశుద్ధిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126 ప్రకారం ఇది నేరమని పేర్కొన్నారు. పోలింగ్, ఎన్నికల ఏజెంట్లకు సున్నితమైన ఓటరు సమాచారాన్ని వ్యూహాత్మకంగా పంపిణీ చేయడం, ఓటరు ప్రవర్తనను రహస్యంగా ప్రభావితం చేయడమేనని ఆరోపించారు. తద్వారా ఎన్నికల హక్కుల స్వేచ్ఛా వినియోగంలో జోక్యం చేసుకోవడమే అవుతుందని పేర్కొన్నారు.

- **జగదాంబ :** టీడీపీ 'వుయ్' యాప్‌పై సీతమ్మధార తహసీల్దార్ జి.శ్రీరామ్మూర్తికి వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంసీఎం అధికారులకు మెసేజ్ పంపించి వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రయాణికుల కోసం ఎన్నికల స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ ఎన్నికల కోసం వచ్చిన ప్రయాణికుల కోసం విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం–బ్రహ్మపూర్ ఫాస్ట్ పాసింజర్ సోమవారం ఉదయం 8.30గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మధ్యాహ్నం 1గంటకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–విశాఖపట్నం ఫాస్ట్ పాసింజర్ బ్రహ్మపూర్‌లో సాయంత్రం 6.30గంటలకు బయల్దేరి రాత్రి 11.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఇదేందయ్యా వెలగపూడి?


ఎంవీపీ కాలనీలో వెలగపూడి కార్యాలయం ముందు రోడ్డుపై వేసిన టెంట్లు

- జీవీఎంసీ రోడ్డును ఆక్రమించి పార్టీ కార్యకలాపాలు
- స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తూ సమావేశాలు

ఆరిలోవ: విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ఎన్నికల శంఖారావం మోగినప్పటి నుంచి అడుగడుగునా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం తమకు షరామామూలే అన్నట్లు టీడీపీ కార్యకర్తలు సైతం బరితెగిస్తున్నారు. మైనర్లను ప్రచారంలో ఉపయోగించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను సైతం ప్రచారంలో వాడుకున్నారు. ప్రజా వినియోగంలోని జీవీఎంసీ రోడ్డుపై టెంట్లు వేసి మరీ ఆయన ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

ఎంవీపీకాలనీ సెక్టార్-4లో వెలగపూడి రామకృష్ణబాబు క్యాంపు కార్యాలయం ఉంది. తొలి నుంచి ఇక్కడి నుంచే వెలగపూడి ఎమ్మెల్యేగా తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికలు వచ్చిన ప్రతి సారీ ఆయన ఇష్టారాజ్యంగా రోడ్డును బ్లాక్ చేయడం, ఇరుగు పొరుగు వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం పరిపాటిగా మారింది. ఎన్నికలు సందర్భంగా ఇటీవల వరకు తన కార్యాలయాన్ని ఆనుకుని రోడ్డుపై టెంట్ వేసిన రామకృష్ణబాబు ప్రస్తుతం ఆ టెంట్ల సంఖ్యను రెండుకు పెంచారు. కార్యాలయాన్ని ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా టెంట్లు వేసి ఇష్టారాజ్యంగా ఎన్నికల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడికి వచ్చే నాయకులు, కార్యకర్తల వాహనాలు, ప్రజల రద్దీతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైనే కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తుండటం అసహనానికి గురవుతున్నారు. ఎమ్మెల్యేననే అహంతో వెలగపూడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘనుడు

వెలగపూడి రామకృష్ణబాబు ఎన్నికల నిబంధనలను ఆది నుంచి ఉలంఘిస్తున్నారు. ప్రచారంలో సమయపాలన పాటించకపోవడంతో పాటు హనుమంతవాక కొండవాలులో మైనర్లను ఉపయోగించి ఇళ్ల గోడలపై టీడీపీ స్టిక్కర్లు అతికించారు. ఆరిలోవ, జాలరిపేట, పెదవాల్తేరు ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులతో ప్రచారం చేయించి.. వారి ఉద్యోగాలు పోవడానికి కారకుడయ్యారు. ఇప్పుడు రోడ్డును ఆక్రమించి ఎన్నికల కార్యకలాపాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వీటిపై ఫిర్యాదుల చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జనసేన మహిళలపై టీడీపీ నాయకుల దాడి


మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం : రాష్ట్ర వ్యాప్తంగా జనసేన, టీడీపీ మధ్య అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఇదే పరంపర జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. జనసేన మహిళా కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంచే విషయంలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారనే అక్కసుతో టీడీపీ నాయకురాలు తన భర్తతో కలిసి దాడి చేసింది. వివరాల్లోకి వెళ్తే... గత మూడు రోజులుగా అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ, జనసేన మహిళా కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పింపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో జనసేనకు చెందిన షాలిని, అరుణ మూడు బూత్‌ల పరిధిలో ఓటర్లకు డబ్బుల పంపిణీకి చర్యలు చేపట్టారు. అదే సమయంలో టీడీపీ నాయకురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఆమె భర్త వేంకటేశ్వరరావు (చంటి)కి అధిష్టానం నుంచి వచ్చే డబ్బులు మిగలకపోవడంతోపాటు జనసేన మహిళా నాయకులు అధిపత్యం చెలాయిస్తున్నారన్న అక్కసుతో ఆదివారం మధ్యాహ్నం షాలిని, అరుణ వున్న కార్యాలయంలో మరో వ్యక్తితో కలిసి దాడి చేశారు. ఈ దాడితో జనసేన మహిళలకు గాయాలవడంతో పాటు దుస్తులు చిరిగిపోయాయి. వెంటనే వారు 100 నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సోమవారం పోలింగ్ జరగనున్న అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పక్కనే ఉన్న టీడీపీ కార్యాలయంలో దాడి జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలను పోలీసులు హెచ్చరించారు. శాంతియుతంగా ఎన్నికలకు సహకరించాలని కోరారు.